సాక్షి జయశంకర్ భూపాలపల్లి

సోమవారం | 27 | జనవరి | 2025



సంక్షేమ పథకాల అమలుపై అధికారుల నిలదీత

అర్హులకు సంక్షేమ పథకాలు అందలేదని పలువురుకాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్‌ను నిలదీశారు. - 8లో▸




అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. - 9లో▸

గరిష్టం/కనిష్టం
31.1°/17.2°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.





బోల్తా పడిన భారీ ట్రైలర్ ట్రక్

నలిగిన వలస బతుకులు

పొట్టకూటి కోసం వస్తే నలుగురి ప్రాణం పోయింది

- ఐదు రోజులక్రితమే మామునూరుకు వచ్చిన కుటుంబం
- వ్యవసాయ పనిముట్లు చేస్తూ జీవనోపాధి
- ట్రైలర్ ట్రక్ రూపంలో కబళించిన మృత్యువు
- లారీ డ్రైవర్ ఓవర్ స్పీడ్, ఇనుపరాడ్లు మీదపడడంతో మృతదేహాలు నుజ్జునుజ్జు
- మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు..



ఆటో కింద ఇరుక్కుపోయిన ఆటో డ్రైవర్ రాపర్తి సాగర్

పొట్టకూటి కోసం ఐదు రోజులక్రితమే రాష్ట్రం విడిచి వచ్చారు. డేరాలు వేసుకుని ఇనుప పనిముట్లు తయారు చేసి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. మరో ఊరిలో వీటికి గిరాకీ బాగుందని తెలుసుకున్న ఆ కుటుంబం ఆటోలో వెళ్తుండగా బయల్దేరిన పది నిమిషాల్లో18 టైర్లతో కూడిన ట్రైలర్ ట్రక్ మృత్యు రూపంలో దూసుకొచ్చింది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు విగతజీవులయ్యారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని గరీబ్‌నగర్‌కు చెందిన నువురు సంతోశ్‌చౌహాన్ (45), అతడి కుమార్తెలు పూజ చౌహాన్ (20), కిరణ్ చౌహాన్ (18), కుమారుడు ఖన్నా చౌహాన్ (7)గా గుర్తించారు. సంతోశ్ భార్య చామాబాయి, కుమారుడు ముఖేశ్ చౌహాన్‌తో పాటు ఆటోడ్రైవర్లు ఎండీ షకీర్, రాపర్తి సాగర్, చిర్రరాజుకు గాయాలయ్యాయి.

- సాక్షి, వరంగల్ - పూర్తి వివరాలు 8లో▸



రోడ్డు పక్కన పడిపోయిన ఆటో, ఐరన్ రాడ్లు



మృతదేహాన్ని తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

న్యూస్‌రీల్

రాజ్యాంగం స్ఫూర్తితో దేశం అభివృద్ధి

- ఎస్పీ కిరణ్ ఖరే



భూపాలపల్లి: భారత రాజ్యాంగం ఇచ్చిన స్ఫూర్తితో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కిరణ్ ఖరే జాతీయ జెండాను ఆవిష్కరించి సిబ్బంది, జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎందరో త్యాగధనుల ఫలితం గణతంత్ర దినోత్సవం అన్నారు. ఎందరో మహనీయులు ప్రాణాలను త్యాగం చేయడం ద్వారా మనం స్వేచ్ఛ, స్వతంత్రంగా జీవిస్తున్నామని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన ఏడు దశాబ్దాలలో దేశం అన్ని రంగాల్లో ఘనంగా ప్రగతి సాధించిందని, ఆర్థిక, సాంకేతిక వృద్ధి సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బోనాల కిషన్, ఏఆర్ అదనపు ఎస్పీ వేముల శ్రీనివాస్, డీఎస్పీలు సంపత్‌రావు, రామ్మోహన్ రెడ్డి, నారాయణనాయక్, జిల్లా పరిధిలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా విజయలక్ష్మి



భూపాలపల్లి: భూపాలపల్లి మున్సిపాలిటీ స్పెషలాఫీసర్‌గా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) విజయలక్ష్మిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మున్సిపాలిటీల పాలకవర్గం గడువు ఆదివారంతో ముగియడంతో ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ మేరకు భూపాలపల్లి మున్సిపాలిటీకి విజయలక్ష్మిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు.

విషగుళికలు తిని ఆరు గొర్రెల మృతి

టేకుమట్ల: విషగుళికలు తిని ఆరు గొర్రెలు మృతి చెందిన ఘటన మండలంలోని బండపల్లిలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. బాధితుడు బండి ప్రశాంత్ కథనం ప్రకారం మండలంలోని కుందనపల్లి శివారు చెరువు కట్టపై శనివారం గుర్తు తెలియని వ్యక్తులు విష గుళికలను చల్లగా మేతకు వెళ్లిన గొర్రెలు విష గుళికలను తిని ఆదివారం తెల్లవారే సరికి మృత్యువాత పడినట్లు తెలిపారు. ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై దాసరి సుధాకర్ తెలిపారు.

కృష్ణయ్యకు పద్మశ్రీ ఇవ్వాలి

మల్హర్: బీసీ ఉద్యమనేత ఆర్.కృష్ణయ్యకు పద్మశ్రీ అవార్డు ఇవ్వాలని జాతీయ బీసీ సంఘం జిల్లా ఇన్‌చార్జ్ విజయగిరి డిమాండ్ చేశారు. మండలంలోని కొయ్యూరులో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సమ్మయ్య మాట్లాడారు. తెలంగాణ బీసీ ముద్దుబిడ్డ, జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య 45 సంవత్సరాలుగా బీసీల కోసం నిరంతరం పోరాడుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే కృష్ణయ్యకు పద్మశ్రీ అవార్డు ప్రకటించాలని కోరారు. బీసీల జనాభా ప్రతిపాదికగా రిజర్వేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ రద్దుచేసి బీసీలకు అట్రాసిటీ చట్టం అమలు చేయాలన్నారు.

సమగ్రాభివృద్ధే లక్ష్యం

నాలుగు పథకాలతో పేదల్లో వెలుగులు

- వైద్యరంగానికి సరిపడా నిధులు
- అన్నదాతలకు ఆసరాగా సర్కారు
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ రాహుల్ శర్మ

మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్



పోలీసుల కవాతును తిలకిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే



నృత్యం చేసిన విద్యార్థులతో కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే



గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతం అనే తేడా లేకుండా జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, ప్రభుత్వ పథకాలను అర్హులైన వారందరికీ అందించేందుకు కృషి చేస్తున్నాం. ప్రభుత్వ సహకారంతో జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతుందని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. 76వ గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి హాజరుకాగా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసులతో గౌరవ వందనం స్వీకరించి.. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని వివరించారు.

నాలుగు పథకాలు అమలుకు శ్రీకారం..

పేదలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు చేపట్టిన రైతు భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమాలకు క్షేత్రస్థాయి విచారణ నిర్వహించామని తెలిపారు. 21నుంచి 24వ తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, భూపాలపల్లి మున్సిపాల్టీలో ప్రజల సమక్షంలో గ్రామసభలు నిర్వహించి జాబితాల్లో పేర్లు లేని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. సంక్షేమ పథకాల అమలు అనేది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని వెల్లడించారు.

ఉచిత బస్సు ప్రయాణం..

మహలక్ష్మి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించిందని, ఇప్పటి వరకు జిల్లాలో 98.60 లక్షల మహిళలు ప్రయాణించగా రూ. 50.15 కోట్లు మహిళలకు ఆదా జరిగినట్లు తెలిపారు.

వైద్యానికి పెద్దపీట..

ఔషధి ద్వారా 92,818 మందికి, తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్ ద్వారా 96,870 మందికి వైద్య సేవలు అందించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, మహదేవపూర్‌లోని డయాలసిస్ కేంద్రాల ద్వారా 1,867 మందికి డయాలసిస్ సేవలు అందించామని పేర్కొన్నారు. ఆరోగ్య మహిళా పథకం కింద 200 క్యాంపులు నిర్వహించి 7,973 మందికి వైద్యసేవలు అందించామని తెలిపారు.

అన్నదాతలకు ఆసరాగా..

జిల్లాలో రూ.2లక్షల రుణం పొందిన 37,235 మంది రైతులకు రూ.332 కోట్ల 23 లక్షల రుణమాఫీ చేశామని తెలిపారు. రైతు భరోసా కింద యాసంగిలో 79,544 మంది రైతులకు రూ.79కోట్ల 15 లక్షలు చెల్లించామన్నారు. ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తూ రైతుబీమా అమలు చేస్తుందని, జిల్లాలో 72,118 మంది రైతులకు రైతుబీమా చేశామన్నారు. వారిలో మరణించిన 1,363 మంది రైతు కుటుంబాలకు రైతుబీమా ద్వారా రూ.68.15కోట్ల ఆర్థికసాయాన్ని అందించినట్లు కలెక్టర్ రాహుల్ శర్మ వెల్లడించారు.

అలరించిన కార్యక్రమాలు..

గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం, పలు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు చేయగా, వివిధ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో ఎస్పీ కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం దేవస్థానం ఈఓ బదిలీ

- గతంలో పనిచేసిన గ్రేడ్–1 ఈఓ మహేష్ నియామకం
- సింగర్ మధుప్రియ ఎపిసోడ్‌తోనే అంటూ పుకార్లు



శనిగల మహేష్



ఎడవల్లి మారుతి

కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం ఈఓపై బదిలీ వేటు పడింది. కాళేశ్వరం దేవస్థానంలో గ్రేడ్–2 ఈఓగా పనిచేస్తున్న ఎడవల్లి మారుతిని శనివారం రాత్రి దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్ బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఆయన స్థానంలో గతంలో కాళేశ్వరం దేవస్థానంలో రెండేళ్లపాటు గ్రేడ్–1 ఈఓగా విధులు నిర్వర్తించి రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే బదిలీపై రేగొండ మండలం కొడవటంచ లక్ష్మీనరసింహాస్వామి దేవస్థానం వెళ్లిన శనిగెల మహేష్‌ను మళ్లీ కమిషనర్ నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ఈఓ మారుతిని కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం గట్టుదుద్దనపల్లిలో శ్రీఆంజనేయస్వామి ఆలయానికి బదిలీపై వెళ్లారు. ఆయనకు మరో 10 ఆలయాలకు ఈఓగా వ్యవహరిస్తున్నారు.

మధుప్రియ ఘటనేనా..

ఈనెల 20న అనుమతి లేకుండా సింగర్ మధుప్రియ స్వామివారి గర్భగుడిలో పాట చిత్రీకరణ చేయడంపై తీవ్ర చర్చ జరిగింది. పలుసంఘాల నాయకులు, పార్టీల నాయకులు ఈఓతో పాటు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మధుప్రియ ఎపిసోడ్‌కు నెల రోజుల ముందు నుంచే మారుతి బదిలీపై రాజకీయంగా పైరవీలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ ఒత్తిళ్లతోనా.. మధుప్రియ ఘటన కారణమా బదిలీకి అనే అంశం దేవాదాయ శాఖ అధికారులకు తెలియాలి.

పుష్కరాలవేళ..

రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో కుంభాభిషేకం, 26న మహాశివరాత్రి ఉత్సవాలు, మే 15నుంచి 26 వరకు సరస్వతీ నది పుష్కరాలను ఘనంగా నిర్వహించడానికి సన్నద్ధం అయింది. ఈఓ మారుతి కూడా ఆయనకున్న 10 ఆలయాల అదనపు బాధ్యతతో పాటు కాళేశ్వరం దేవస్థానంలో జరిగే సరస్వతీ పుష్కరాలు, కుంభాభిషేకం సమీక్షలు, కలెక్టర్ సమీక్షలు, ఇతర రాష్ట్రాలకు వెళ్లి శృంగేరీ పీఠాధిపతికి ఆహ్వానం, తమిళనాడులోని మహాబలిపురం వెళ్లి సరస్వతీ మాత విగ్రహ తయారీ పనులు, సమీక్షలు, సమావేశాల్లో పాల్గొన్నారు. సోమవారం ఈఓ మారుతి రిలీవ్ అవుతుండగా, గ్రేడ్–1 ఈఓ మహేష్ బాధ్యతలు తీసుకోనున్నారు. ఆలయ నిర్వహణ చక్కబెట్టి, గాడిలో పడేయాలని భక్తులు ఈఓను కోరుతున్నారు.

డబ్బులు రాకుంటే ఓట్లు వేయకండి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



అనుమతి పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల: ఆత్మీయ భరోసా డబ్బులు రెండు రోజుల్లో మీ అకౌంట్లలోకి రాకుంటే స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క ఓటు కూడా వేయకండని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం మండలంలోని ముచినిపర్తి గ్రామంలో ప్రజాపాలన పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటా ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు వచ్చిన లబ్ధిదారులు మంచి రోజులు చూసుకుని ముగ్గు పోసుకుని ఇళ్లు కట్టుకోవాలని కోరారు. ఎవరైనా నిరుపేదలు ఉంటే తానే ఇళ్లు కట్టిస్తానని అన్నారు. ఆత్మీయ భరోసా లబ్ధిదారులకు రెండు రోజులలో ఒక్కొక్కరి అకౌంట్లలో ఆరు వేలు జమ అవుతాయని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో రైతు భరోసా కింద 1,394 మందికి, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 11మందికి, కొత్తరేషన్ కార్డులు 54మంది లబ్ధిదారులకు, ఇందిరమ్మ ఇండ్ల పత్రాలు 113మందికి ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ చిన్నయ్య, తహసీల్దార్ హేమ, ఎంపీడీఓ జయశ్రీ, ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి–సత్యం, ఎంపీఓ రామకృష్ణ, ఆర్ఐ రాజు, ఏపీఓ హలీంపాషా, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, మాజీ జెడ్పీటీసీలు ఓరం సమ్మయ్య, పులి తిరుపతిరెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, కామిడి రత్నాకర్‌రెడ్డి, ఆరెపల్లి మల్లయ్య, మన్నెం శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

సమష్టి కృషి, అంకితభావంతో పనిచేయాలి

సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి



ఉత్తమ ఉద్యోగులకు సన్మానిస్తున్న జీఎం, అధికారులు, నాయకులు



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న జీఎం



జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న జీఎం

భూపాలపల్లి అర్బన్: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ సమష్టి కృషి, అంకితభావంతో పనిచేసి సంస్థను లాభాల్లోకి తీసుకువెళ్లాని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. 76వ గణతంత్ర దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆదివారం జీఎం కార్యాలయ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం సుభాష్‌కాలనీలోని కాకతీయ స్టేడియంలో ఏర్పాటు చేసిన వేడుకలకు జీఎం ముఖ్యఅతిథిగా హాజరై సింగరేణి సెక్యూరిటీ గార్డులతో గౌరవ వందనం స్వీకరించి పతాకావిష్కరణ చేశారు. సింగరేణి ఉత్తమ ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ అన్ని ప్రభుత్వ రంగ సంస్థల కంటే ఎంతో మెరుగైన లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధిస్తూ తన వంతు పాత్రను సమర్థవంతంగా పోషిస్తున్నట్లు వివరించారు. బొగ్గు ఉత్పత్తితో పాటు విద్యుత్ ఉత్పత్తి చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 37.06 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి 26.98 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించినట్లు చెప్పారు. ఏరియాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా వివిధ వృత్తులకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సింగరేణి ఏరియా ఆస్పత్రుల్లో ప్రత్యేక వైద్య నిపుణులను నియమించి వైద్యసేవలు మెరుగుపరిచినట్లు తెలిపారు. విలీన గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రమాదాల నివారణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాల్సి ఉందని, రక్షణపై ప్రతి ఒక్కరికి మరింత అవగాహన కల్పించేందుకు అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏరియాలోని అధికారులు, యూనియన్ నాయకులు పారిశ్రామిక సంబంధాలకు ఎటువంటి విఘాతం కలిగించకుండా యాజమాన్యానికి సహకరించాలని కోరారు. సింగరేణి సంస్థ అభివృద్ధి ద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం కవీంద్ర, అధికారులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అడవులను మరింత అభివృద్ధి చేయాలి

పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ



ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న పీసీఈసీఎఫ్ సువర్ణ

కాటారం: అడవుల్లో మొక్కల పెంపకం విరివిగా చేపట్టి అడవిని ఘనంగా అభివృద్ధి పరచాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్సరవేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ సువర్ణ సూచించారు. కాటారం మండలం కొత్తపల్లి సమీపంలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్లాంటేషన్‌ను ఆదివారం పీసీసీఎఫ్ పరిశీలించారు. ప్లాంటేషన్ విస్తీర్ణం, చేపడుతున్న మొక్కల పెంపకం, మొక్కల రకాలపై ఆరా తీశారు. ప్లాంటేషన్‌లో నాటిన ప్రతి మొక్క చెట్టుగా ఎదిగేలా చూడాలని, మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీసీసీఎఫ్ వెంట కాళేశ్వరం సీసీఎఫ్ ప్రభాకర్, భూపాలపల్లి డీఎఫ్ఓ నవీన్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ముక్తివనం పార్కును పరిశీలించిన పీసీసీఎఫ్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని ముక్తివనం పార్కును రాష్ట్ర అటవీశాఖ పీసీసీఎఫ్ సువర్ణ, కాళేశ్వరం సీసీఎఫ్ ప్రభాకర్, డీఎఫ్ఓ నవీన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఆదివారం ఆమె పార్కు అభివృద్ధి కోసం ప్రణాళికలు, సలహాలు ఇచ్చి దిశానిర్దేశం చేశారు. రేంజర్ రవి, ఎఫ్ఎస్ఓ ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

కాళేశ్వరాలయంలో పూజలు..

కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని పీసీసీఎఫ్ సువర్ణ దర్శించుకున్నారు. ముందుగా ఆమెను రాజగోపురం నుంచి వేదపండితులు మంత్రోచ్చరణల నడుమ పూర్ణకుంభ స్వాగతం పలికారు. శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు.

ప్రతీ ఒక్కరికి అభివృద్ధి ఫలాలు

భూపాలపల్లి: ప్రతీ ఒక్కరికి అభివృద్ధి ఫలాలు అందేలా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారత రాజ్యాంగాన్ని రూపొందించారని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(కంపా) డాక్టర్ సి.సువర్ణ అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె ఆదివారం గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని జిల్లా అటవీశాఖ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లాకేంద్రంలోని జయశంకర్ ఎకో పార్కును పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో కాళేశ్వరం సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ బి.ప్రభాకర్, డీఎఫ్ఓ మందాడి నవీన్, భూపాలపల్లి రేంజ్ ఆఫీసర్ బస్వ నరేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఫెల్లోషిప్స్ కలిగిన విద్యార్థులు యూజీసీనెట్, సీఎస్ఐఆర్ నెట్, సీడ్, డీఎస్‌టీ, ఎన్ఈఎఫ్‌డబ్ల్యూడీ, డీఎస్‌టీ–ఇన్‌స్పైర్ లేదా ఎఫ్ఐపీ, క్యూఐపీ టీచర్ ఫెల్లోషిప్స్ తదితర నెట్, గేట్, జీప్యాట్ నేషనల్ లెవల్ టెస్ట్ స్కోర్స్ నెట్ కలిగిన వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసీ.ఇన్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవాలని సైన్స్ విభాగాల డీన్ ఆచార్య జి.హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన అప్లికేషన్లను సంబంధిత కార్యాలయంలో ఫిబ్రవరి 12 లోపు అందజేయాలని సూచించారు. ఓసీ, బీసీ విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ విద్యార్థులు రూ.800 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బోటనీ 6, కెమిస్ట్రీ 3, జియాలజీ 1, మ్యాథ్‌మెటిక్స్ 5, ఫిజిక్స్ 2, జువాలజీ 11 సీట్లు ఉన్నాయని వివరించారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



కేయూ క్యాంపస్: యువత మత్తుకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అన్నారు. కాకతీయ యూనివర్సిటీలో మత్తు పదార్థాల నియంత్రణపై రెండ్రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ ఆదివారం ముగిసింది. ఎంపిక చేసిన ఉమ్మడి జిల్లాకు చెందిన యువత ఇందులో పాల్గొనగా.. ముగింపు సమావేశంలో ఈసం నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత తమలోని నైపుణ్యాలను వ్యక్తిగత జీవితానికి, కుటుంబానికి సమాజానికి ఉపయోగించుకోవాలన్నారు. రిసోర్స్‌పర్సన్, మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ కమ్యూనిటీ మొబలైజేషన్‌పై అవగాహన కల్పించారు. జిల్లా యువజన అధికారి చింతల అన్వేశ్, యాంటీ నార్కోటిక్స్ సీఐ రవీందర్, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సైకియాట్రిస్ట్ విభాగం డాక్టర్ సాయికిరణ్, ప్రొఫెసర్ మురళి, డాక్టర్ నవీన్, గణిత విభాగాధిపతి డాక్టర్ భారవిశర్మ, హాస్టళ్ల డైరెక్టర్ డాక్టర్ ఎల్పీ రాజ్‌కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహీత మధు, నెహ్రూ యువ కేంద్రం సూపరింటెండెంట్ బానోత్ దేవీలాల్, న్యాయవాది మహేందర్ పాల్గొన్నారు.

ఉత్తములకు అవార్డుల ప్రదానం



ప్రశంసపత్రం అందుకుంటున్న ఏఎస్పీ బోనాల కిషన్

జిల్లాలోని వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు 76వ గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని అవార్డులను ప్రదానం చేశారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ప్రశంస పత్రాలు అందజేశారు.

- భూపాలపల్లి



శీలం శ్రీనివాస్, డీపీఆర్ఓ | ఎ.సంపత్‌రావు, డీఎస్పీ, భూపాలపల్లి | డి.నరేష్‌కుమార్, సీఐ, భూపాలపల్లి | శ్రీనాథ్, డీసీఎస్ఓ



నరేష్, డీఆర్‌డీఓ | చిన్నయ్య, డీడబ్ల్యూఓ | నారాయణరావు, డీపీఓ | యాదగిరి, ఈఈ, ఇరిగేషన్ | షాఖాన్, ఎస్సై 2, రేగొండ | ఫసియొద్దీన్, సీసీ టు ఎస్పీ | మల్హార్ నాయక్, ఎస్ఈ, ఎన్పీడీసీఎల్ | రత్నం, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ | కిరణ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ | స్వప్నకుమారి, ఎస్సై, భరోసా సెంటర్ | జి.అశోక్, ఎస్సై, మొగుళ్లపల్లి | ఆర్.అశోక్, ఎస్సై, గణపురం



రమేష్, ఎస్సై, పలిమెల | పవన్, ఎస్సై, మహదేవపూర్ | కుసుమకుమారి, ఏడీ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ | రాజేందర్, డీఈఓ | కుమారస్వామి, డీడీ, పశుసంవర్ధకశాఖ | ఫణిభూషణ్, పేఅండ్ అకౌంట్స్ ఆఫీసర్ | అనూష, పంచాయతీ కార్యదర్శి | రవికుమార్, తహసీల్దార్, మల్హర్ | హేమ, తహసీల్దార్, చిట్యాల | జయశ్రీ, ఎంపీడీఓ, చిట్యాల | గంగాదరి రాజు, అసిస్టెంట్ గ్రేడ్ 1 | అశోక్, కానిస్టేబుల్, రవాణా శాఖ



రాజారత్నం, ఆశ్రమ పాఠశాల | రాజయ్య, హాస్టల్ వార్డెన్, జంగేడు | రాజేష్, రికార్డ్ అసిస్టెంట్ | ఆకుల శ్రీకాంత్, కార్యదర్శి | శ్రీకాంత్, ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి | రాహీల్, పేరూరు డాక్టర్ | శోభారాణి, ఏఎన్‌ఎం | శ్రీదేవి, ఆశా కార్యకర్త | నూతన్, జూనియర్ అసిస్టెంట్ | ఉమా, సోషల్‌వెల్ఫేర్ | సురేష్, కంప్యూటర్ ఆపరేటర్ | శ్రీనివాస్, జిల్లా ఎక్సైజ్ అధికారి



జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



వేదికపై ఆసీనులైన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాశ్‌రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్



స్వాతంత్య్ర సమరయోధులను సన్మానిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, ఎమ్మెల్యే సత్యనారాయణరావు



పౌర సంబంధాల శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌ను వీక్షిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, ఎమ్మెల్యే గండ్ర

సంక్షేమ పథకాల అమలుపై అధికారుల నిలదీత

- మంత్రి శ్రీధర్‌బాబు స్వగ్రామంలో ఘటన

కాటారం: అర్హులైన కొందరికి ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు అందలేదని పలువురు గ్రామస్తులు కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్‌తో పాటు అధికారులను నిలదీశారు. ప్రభుత్వం అమలుకు శ్రీకారం చుట్టిన రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల మంజూరుపై ఆదివారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్వగ్రామం కాటారం మండలం ధన్వాడలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆయా పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు అధికారులు మంజూరు పత్రాలు అందజేసి వెళ్తున్న సబ్ కలెక్టర్‌ను పలువురు అడ్డుకున్నారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ పలువురికి సంక్షేమ పథకాలు అందలేదని గ్రామానికి చెందిన బోడ శ్రీధర్, నిమ్మల సుధాకర్‌తో పాటు పలువురు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు పథకాలు ఎందుకు అందలేదని సబ్‌కలెక్టర్‌ను ప్రశ్నించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామని సబ్‌కలెక్టర్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందజేస్తామని పేర్కొన్నారు.



సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న పలువురు లబ్ధిదారులు

ఎస్సార్‌లో 'షణ్ముఖ ప్రియ' హంగామా

- ఆకట్టుకున్న ప్రదర్శన
- ఆదిరిన విద్యార్థుల ర్యాంప్‌వాక్
- ముగిసిన స్పార్కిల్ వేడుకలు



పాడుతున్న సింగర్ షణ్ముఖప్రియ

హసన్‌పర్తి: ఎస్సార్ యూనివర్సిటీలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్పార్కిల్ వేడుకలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా ప్రముఖ గాయని షణ్ముఖ ప్రియ బృందం హంగామా చేసింది. షన్ముఖ పాటలకు వేదిక కింద ఉన్న విద్యార్థులు స్టెప్పులు వేశారు. ముంబాయి సినిమాలోని 'హమ్మ .. హమ్మ' అనే పాటకు విద్యార్థుల కేరింతలతో ఆ ప్రాంతం మార్మోగింది. తొలుత కళాశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు మంత్రముగ్ధులను చేశాయి. విద్యార్థుల ర్యాంప్ వాక్ ఆదిరింది. వివిధ వేషధారణలో విద్యార్థులు ర్యాంప్‌పై ప్రదర్శనలు ఇచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన నాటకాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎ. వరదారెడ్డి మాట్లాడుతూ సాంస్కృతిక ప్రదర్శనలతో విద్యార్థులతో మానసిక వికాసం పెంపొందుతోందన్నారు. కార్యక్రమంలో ఎస్సార్ యూనివర్సిటీ వీసీ దీపక్‌గార్గ్, రిజిస్ట్రార్ అర్చనారెడ్డి, డాక్టర్ సుధాకర్, ప్రోగ్రాం కన్వీనర్లు శశిధర్‌రెడ్డి, వాణిశ్రీ, భావన తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు



విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న వరదారెడ్డి

ఉత్సాహంగా 'ఎట్ హోం'

హన్మకొండ అర్బన్: గణతంత్ర వేడుకల్లో భాగంగా హనుమకొండ కలెక్టర్ ఆధ్వర్యాన సంప్రదాయ బద్ధంగా నిర్వహించే ఎట్ హోం.. తేనీటి విందు కార్యక్రమం ఆదివారం రాత్రి కలెక్టరేట్‌లో ఉత్సాహంగా సాగింది. చిన్నారుల ఆటాపాటలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేశ్‌బాబు, పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా దంపతులు, గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్వినీతానాజీ వాఖడే, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఇతర జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఎట్ హోం కార్యక్రమంలో సీపీ, మున్సిపల్ కమిషనర్, కలెక్టర్

నలిగిన వలస బతుకులు

ట్రేలర్ ట్రక్ రూపంలో నలుగురిని కబళించిన మృత్యువు

- లారీ డ్రైవర్ ఓవర్ స్పీడ్, ఇనుపరాడ్లు మీదపడడంతో మృతదేహాలు నుజ్జునుజ్జు
- మృతులు ఒకే కుటుంబానికి చెందిన వారు..

సాక్షి, వరంగల్ : మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని గరీబ్‌నగర్ నగర్‌కు చెందిన నువురు సంతోశ్ చౌహాన్ కుటుంబానిది రెక్కాడితే గాని డొక్కాడనీ కుటుంబం. కత్తులు, కొడవళ్లు, గొడ్డలి, పారలతోపాటు ఇతర వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తూ జీవనాన్ని వెళ్లదీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఐదురోజుల క్రితం మామునూరుకు చేరుకున్నారు. అప్పటికే అక్కడికి వచ్చిన అతడి అన్న కొడుకు సుమీర్ కుటుంబం డేరా వేసుకొని జీవనం వెళ్లదీస్తుండడంతో వారి పక్కనే మరో డేరా వేసుకొని పని చేసుకుంటున్నారు. రెండు కుటుంబాలు ఒక్క దగ్గరే ఉంటుండడంతో వచ్చిన గిరాకీ కుటుంబ ఖర్చులకు సరిపోకపోవడంతో అక్కడికి వచ్చిన ఇతరుల ద్వారా లోహిత గ్రామానికి వెళ్లాలని నిశ్చయించుకున్నారు. ఈ క్రమంలోనే మామునూరు బెటా లియన్ నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌కు కూతవేటు దూరంలో 18 టైర్లతో కూడిన ట్రేలర్ ట్రక్ అతివేగంతో అదుపుతప్పి ఆటోను ఢీకొట్టడంతో అందులో ఉన్న భారీ ఇనుప రాడ్లు ఎగిరి కాస్త ముందు ఉన్నమరో ఆటోపై ఎగిరిపడ్డాయి. ఈ ఘటనలో నువురు సంతోశ్ చౌహాన్(45), అతడి కుమార్తెలు పూజ చౌహాన్(18), కిరణ్ చౌహాన్(18) అక్కడికక్కడే మరణించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కుమారుడు ఖన్నా (8) చనిపోయాడు. ఇనుపరాడ్లు పడడంతో మృతదేహాలు గుర్తుపట్టరాకుండా ఛిద్రమయ్యాయి.

మూడు జేసీబీలతో ఇనుపరాడ్ల తొలగింపు

ఘటనస్థలానికి చేరుకున్న పోలీసులకు అప్పటికే ట్రక్ రోడ్డుకు అడ్డంగా ఉండడంతో ట్రాఫిక్ జామైంది. దీనికితోడు ఇనుపరాడ్లు తీయడం సవాల్‌గా మారింది. సమీపంలోని మూడు జేసీబీలను తీసుకొచ్చారు. ఇటు ఆర్టీఓ జంక్షన్ వైపు హైవే రహదారిని మూసివేసి వాహనాలు రాకుండా చూశారు. ఆ జేసీబీల సాయంతో ఇనుప రాడ్లలో చిక్కుకున్న ఐదుగురు క్షతగాత్రులను బయటకు తీసేందుకు అరగంటకు పైగా సమయం తీసుకుంది. డీఆర్ఎఫ్ బృందాలు కూడా పనిచేశాయి. అప్పటికే సిద్ధంగా ఉన్న అంబులెన్స్‌ల్లో వారిని ఎంజీఎం ఆస్పత్రికి పంపించారు. ఆ తర్వాత రహదారికి అడ్డుగా ఉన్న ట్రేలర్ ట్రక్కును జేసీబీల సాయంతో ఎడమవైపునకు తోసేశారు. రహదారిపై పడి ఉన్న ఇనుప రాడ్లను కుడివైపున పడేశారు. ఆ తరువాత ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు గంటకుపైగా సమయం తీసుకుంది. ఘటనాస్థలిని కలెక్టర్ సత్యశారద, పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పరిశీలించారు.

నిన్న వెళ్తే.. ఈ ఘోరం జరిగి ఉండేది కాదు..

మామునూరు ప్రధాన రహదారికి ఆనుకొని వీరు వేసుకున్న డేరా బోసిపోయింది. ఉదయం 11 గంటల వరకు సంతోషంగా ఉన్న ఆ ఫ్యామిలీ 20 నిమిషాల వ్యవధిలో ఘోర ప్రమాదం బారినపడడంతో అక్కడున్న వారు అయ్యో పాపం అని చర్చించుకోవడం కనిపించింది. 'ఐదు రోజుల పాటు అక్కడే ఆడుతూ పాడుతూ గడిపిన సంతోశ్ కుటుంబం శనివారం సాయంత్రమే లోహితకు వెళ్లాల్సి ఉండే. బొల్లికుంట మీదుగా వెళ్తే త్వరగా వెళ్లొచ్చని చెప్పాం. తెలిసిన వారు గవిచర్ల క్రాస్ నుంచి రమ్మని చెబుతున్నారనడంతో ఆటోను రూ.1,000లకు కిరాయి అడిగితే ఏమీ లేనివారని రూ.500లకు మాట్లాడించి పంపించాం. నిమిషాల వ్యవధిలోనే ఆ కుటుంబం రోడ్డు ప్రమాదం బారినపడడంతో మాకు కన్నీళ్లు ఆగడం లేదు' అని అక్కడే టైలర్ దుకాణంలో పనిచేసే ఓ వ్యక్తి వాపోయాడు.



ప్రమాద స్థలంలో గుమిగూడిన ప్రజలు

నలుగురిని బలిగొన్న మద్యం మత్తు..

మామునూరులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ రాజస్థాన్ వాసి యోగిందర్ సింగ్ తీవ్ర మద్యం మత్తులో ఉన్నాడు. అతడికి పోలీసులు బ్రీత్ అనలైజర్ టెస్టు చేయగా 280 ఎంజీ/100 మిలీ రీడింగ్ నమోదైంది. ఇతడి వల్ల నలుగురి ప్రాణాలు పోయాయి. చాలావరకు రోడ్డు ప్రమాదాలు అతివేగం, డ్రంకన్ డ్రైవ్ వల్లనే జరుగుతున్నాయని, తమకు ఏమాత్రం సంబంధంలేని వ్యక్తుల ప్రాణాలు తీస్తున్నారని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ అన్నారు. ఇలాంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రూ.200 డీజిల్ కొట్టించుకున్నారు...



ఆరుగురు ప్రయాణికులతో వెళుతున్న ఆటో మా పెట్రోల్ బంక్‌లో రూ.200 డీజిల్ పోయించుకున్నారు. ఫోన్ పే పనిచేయకపోవడంతో కాసేపు ఆగారు. చివరకు డబ్బులిచ్చి హైవేపైకి వెళ్లారు. నిమిషాల వ్యవధిలోనే ట్రేలర్ ట్రక్కు అతివేగంతో వచ్చి చేసిన ప్రమాదంతో వీరి ఆటో నుజ్జునుజ్జయింది. మేం పోయేసరికే ఆ ఇనుప రాడ్లు పడి అందులో చిక్కుకున్న వారి ఆర్తనాదాలు మాకు వినిపించాయి. ఆ ఇనుపరాడ్లు తీద్దామంటే బాగా బరువు ఉండడంతో తీయలేకపోయాం.

- జాకీర్, పెట్రోల్‌బంక్ సిబ్బంది

గంట ముందు మాట్లాడా..



గంట ముందు వరకు నన్ను ఎంతో ఆప్యాయంగా పలకరించారు. ఇక్కడికి కొద్ది మీటర్ల దూరంలో ఉన్న లోహిత గ్రామానికి వెళుతున్నామని, వచ్చే ఆదివారం కలుసుకుందామని చెప్పారు. ఇంతలోనే ఘోరం జరిగిపోయింది.

- సుమీర్, సంతోశ్ అన్న కుమారుడు

మెరుగైన వైద్యం అందించండి

- క్షతగాత్రులను పరామర్శించిన వరంగల్ కలెక్టర్ సత్యశారద

ఎంజీఎం: మామునూరు వద్ద ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనలో క్షతగాత్రులైన వారికి మెరుగైన వైద్యం అందించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద ఎంజీఎం వైద్యాధికారులను ఆదేశించారు. ప్రమాద ఘటనను పరిశీలించిన అనంతరం కలెక్టర్ డాక్టర్ సత్యశారద, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఎంజీఎం ఆస్పత్రికి చేరుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. కాగా, స్వల్ప గాయాలపాలైన ఆటో డ్రైవర్ షకీల్‌ను వైద్య చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల కోరిక మేరకు పోస్టుమార్టం పూర్తి చేసిన మృతదేహాలను, చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కలెక్టర్ సత్యశారద ఆదేశాలతో ఎంజీఎం పరిపాలనాధికారులతోపాటు వరంగల్, ఖిలావరంగల్ తహసీల్దార్‌లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావులు దగ్గరుండి ప్రత్యేక అంబులెన్స్‌లో వారి స్వగ్రామానికి పంపించారు.

మంత్రి సురేఖ పరామర్శ..

ఆస్పత్రిలోని క్షతగాత్రులను సాయంత్రం మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితుల గురించి ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళీని అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్నిరకాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు.



ఘటనాస్థలిలో కలెక్టర్ సత్యశారద



క్షతగాత్రులను పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే